United International Journal of Multidisciplinary Research
ISSN: 3048-6726 (UIJMR) Impact Factor: 6.934 (SJIF)
An International Peer-Reviewed and Refereed Multidisciplinary Journal
www.uijmr.in Vol-3, Special Issue-II ,2026

# తెలుగువారి జానపద నృత్యాలు

**డా॥ తప్పెట రామప్రసాద్ రెడ్డి,**
అసోసియేట్ ప్రొఫెసర్, తెలుగుశాఖ,
యోగి వేమన విశ్వవిద్యాలయం, కడప.
9440531520

జానపద కళలు అతి ప్రాచీనమైన ప్రదర్శన కళలు. ఇవి మానవుని అనుభూతులకు, మానసిక చైతన్యానికి, ఆనందోత్సాహాలకు ప్రతీకలు. అందువల్లనే ఇవి అనంతమైన రూపవైవిధ్యం కలిగి ప్రజా జీవితానికి అత్యంత సన్నిహితంగా ఉంటాయి. ఈ జానపద కళలు ప్రజల మధ్యనే పుట్టి, పెరిగడంవలన అనేక వందల సంవత్సరాల నుండి సజీవంగా ఉన్నాయి. ఇందులో కొన్ని కళలు కనుమరుగైనప్పటికీ మరికొన్ని నేటికీ సజీవంగా మిగిలి ఉన్నాయి. ఈ జానపద సంపద జాతికి గర్వకారణం.

తెలుగు ప్రాంతంలో ఎటు చూసిన వివిధ కులాలకు సంబంధించిన విశిష్టమైన జానపద కళారూపాలు అనేకమున్నాయి. ప్రతి కళారూప సౌందర్యాన్ని వర్ణించనలవికాదు. ప్రతి కళారూపంలోనూ ఆయా కులాలకు సంబంధించిన ప్రగాఢ విశ్వాసాలు, సంప్రదాయాలు, ఆచార వ్యవహారాలు, వేషభాషలు కనిపిస్తాయి.

జానపద కళారూపానికి మూలధాతువు ప్రదర్శన. ఇందులో ప్రేక్షకులు అంటే శ్రోతలు, కళాకారులు ఇద్దరూ చాలా అవసరం. ప్రేక్షకుల మధ్య కళాకారులు ప్రదర్శించే కళారూపానికి సందర్భం కూడ తోడవుతుంది. ఈ సందర్భానికి ఎంతో ప్రాధాన్యత ఉంది. కళా ప్రదర్శనలో ప్రేక్షకుల పాత్ర చాలా గొప్పది. వారి స్పందనలకనుగుణంగా మార్పు చెందటమనేది కేవలం జానపద కళారూపాలకే చెల్లింది. అందుకే ఇవి ప్రజా జీవితంలో విడదీయరాని సంబంధం కలిగి ఉన్నాయి. ఈ సంబంధం తరతరాలుగా వస్తున్న వారసత్వ సంపదగా మారింది. జానపద కళల ద్వారా వారసత్వంగా భావ ప్రసారం జరుగుతున్నది. నేటి ఆధునిక ప్రసార మాధ్యమాలైన రేడియో, టివి, ఇంటర్నెట్, సినిమా చేస్తున్న పనిని తరతరాలుగా జానపద కళారూపాలు నిర్వహిస్తూ వస్తున్నాయి. అందువల్ల వీటిని జానపదుల సజీవ ప్రచార, ప్రసార సాదనాలుగా పేర్కొనవచ్చు. ఈ జానపదకళలు సామాజికంగా అనేక మార్పులకు లోనవుతుంటాయి. ఆయా స్థల, కాల పరిస్థితులకు అనుగుణంగా రూపాంతరం చెందుతుంటాయి. ఎలాంటి విషయాన్నైనా ప్రజలకనుగుణంగా మలచి చెప్పగలిగే సత్తా జానపద కళలకే సొంతం,

జానపద కళారూపాలను స్థూలంగా నాలుగు వర్గాలుగా విబజించుకోవచ్చు. అవి 1) సంగీత ప్రధానాలు, 2) నృత్య ప్రధానాలు, 3) రూపక ప్రధానాలు, 4) ఇతర కళారూపాలు.

United International Journal of Multidisciplinary Research
ISSN: 3048-6726 (UIJMR) Impact Factor: 6.934 (SJIF)
An International Peer-Reviewed and Refereed Multidisciplinary Journal
www.uijmr.in Vol-3, Special Issue-II ,2026

**జానపద రంగస్థలం:** జానపద కళలకు, సాహిత్యానికి ప్రత్యేక రచయితలుగాని, గాయకులుగాని, నటులుగాని ఉండరు. అలాగే ఈ కళలను ప్రదర్శించడానికి ప్రత్యేకంగా నిర్మించబడిన వేదికలుగాని, రంగస్థలాలుగాని ఉండవు. ఈ కళలకు సామూహిక తత్వముంది. అందుకే ఎక్కువ మంది ప్రజలు గుమిగూడే స్థలాలే జానపద కళాప్రదర్శనకు వేదికలయ్యాయి. దాదాపు ఈ వేదికలన్నీ ఆకస్మికంగా ఎనుకున్నవే.

రంగస్థలం కొలతల్లో ప్రత్యేకతలుగాని, నియమాలుగాని లేవు. కళాకారులు ప్రదర్శించే కళారూపాన్ని ప్రేక్షకుడు ఎలాంటి ఇబ్బంది లేకుండా తనవితీరా చూడడానికి యోగ్యంగా ఉంటే చాలుననే ప్రాథమిక సూత్రమాధారంగా రంగస్థలాలను ఎంపిక చేస్తారు. ఈ రంగ స్థలాలన్నీ కూడ సహజత్వానికి దగ్గరగా ఉంటాయి. వీధి, రచ్చబండ, కూడలి, దేవాలయం ఇళ్లముంగిట, ఆరుబయట, బహిరంగ ప్రదేశాలు, గ్రామ చావిడి, నడిబజారు లేదా ఎత్తైన ప్రదేశాలలో కళాప్రదర్శన ఏర్పాటు చేస్తారు. ఈ రంగస్థలాలన్నీ కూడ సంగీత నృత్య రూపకాలేవైనా ప్రదర్శించడానికి అనువుగా ఉంటాయి.

**చెక్కభజన:** భజన సంప్రదాయం అతి ప్రాచీనమైంది. భజనలు అనేక రకాలు. అందులో జానపదుల భజనలు ప్రత్యేకత కలిగి ఉన్నాయి. ఈ భజనల్లో, హరిభజన, తాళభజన, సప్తతాళభజన, పండరి భజన, చెక్కభజన మొదలైనవి ఉన్నాయి.

చెక్కలతో చేసే భజన కాబట్టి దీనికి చెక్కభజన అనే పేరు వచ్చింది. 'చెక్క భజనను' 'పలకల భజన', 'పలకలకోలన్న', 'చిరతలభజన', చిరతల రామాయణం' అనే పేర్లతో వివిధ ప్రాంతాల్లో వ్యవహరిస్తారు. అయితే 'చెక్కభజన' అనే పేరే చాలా ప్రసిద్ధమైంది. తెలుగు నేలపై ఈ కళారూపం బాగా ప్రచారంలో ఉంది. చాలా గ్రామాల్లో ఎంతో శిక్షణ పొందిన చెక్కభజన బృందాలున్నాయి. ఈ కళారూపాన్ని 'శ్రీరామలీలలు', శ్రీకృష్ణలీలలు, 'జడకోపులు' అనే మూడు భాగాలుగా ప్రదర్శిస్తారు. "ఈ భజనను ముఖ్యంగా శ్రీరామనవమి పర్వదినాన తప్పనిసరిగా చాలాచోట్ల ప్రదర్శిస్తారు."

**గురువు పాత్ర:** గ్రామాల్లో కొంతమంది ఒక బృందంగా ఏర్పడి భజన నేర్పించడంలో బాగా అనుభవమూ, పేరూ వున్న వ్యక్తిని గురువుగా ఎంపిక చేసుకుంటారు. బృందంలో 20 నుంచి 30 మంది కళాకారులుంటారు. గురువు మొదట బృందానికి సాధారణ పరీక్షలు పెట్టి వాటిలో నెగ్గినవారిని ఎన్నుకొని శిక్షణిస్తాడు. పాటల్లోను, నృత్యంలోను ప్రాథమిక ప్రవేశముండి, దేహధారుఢ్యం కలిగినవారికి ఎంపికలో ప్రాధాన్యత ఉంటుంది. గురువు దగ్గర ఎంతో క్రమశిక్షణతో కళాకారులు కళలను అభ్యసిస్తారు. శిక్షకుల్లో ఉత్సాహాన్ని, కళా జిజ్ఞాసను పురికొల్పడంలో గురువు పాత్ర గణనీయమైంది. కళాకారులు గురువుపట్ల ఎంతో భక్తి శ్రద్ధలు ప్రదర్శిస్తారు.

**United International Journal of Multidisciplinary Research**
ISSN: 3048-6726 (UIJMR) Impact Factor: 6.934 (SJIF)
An International Peer-Reviewed and Refereed Multidisciplinary Journal
www.uijmr.in Vol-3, Special Issue-II ,2026

తెలుగునేలపై చాలా పేరు ప్రఖ్యాతులు సంపాదించిన చెక్కభజన గురువులున్నారు. వీరు జాతీయ స్థాయిలోనే గాక అంతర్జాతీయ స్థాయిలో కూడ పేరు సంపాదించి వివిధ దేశాలలో ప్రదర్శనలిస్తున్నారు.

గురువుకు గురుదక్షిణగా కళాకారులు కొంత భృతిని సమర్పించుకొంటారు. గ్రామాల్లో శిక్షణ సమయంలో వారికి భోజన వసతులు ఏర్పాటు చేస్తారు. ముఖ్యంగా రాత్రి వేళలో, తీరిక సమయాల్లోనే శిక్షణ తీసుకుంటారు. ఈ శిక్షణా కాలం రెండు మూడు నెలల వరకూ ఉంటుంది. శిక్షణలో ప్రతి వ్యక్తిని గురువు శ్రద్ధగా పరిశీలిస్తూ సూచనలిస్తాడు. పదే పదే తప్పు చేస్తున్న వారిని ఒక్కొక్కసారి గురువు దండించడం కూడ జరుగుతుంది. శిక్షణ పూర్తి అయిన తర్వాత 'గజ్జెపూజ' ఉంటుంది. గజ్జె పూజలో భజన చెక్కలను సంప్రదాయ బద్ధంగా పూజిస్తారు. ఆ తర్వాత కళాప్రదర్శనను ఏర్పాటు చేస్తారు.

సాధారణంగా 18 నుండి 45 ఏండ్ల వయసు మధ్యలో ఉన్నవారే శిక్షణ తీసుకుంటారు. ఇటీవల కాలంలో చిన్నపిల్లలు సైతం శిక్షణ తీసుకొని అద్భుతంగా రాణిస్తున్నారు.

**భజనస్వరూపం:** ఒకప్పుడు భక్తి భావాలకు ఆలవాలమైన ఈ కళాస్వరూపం నేడు సాంఘిక, సామాజికాంశాలపైన విస్తృతంగా ప్రదర్శింపబడుతుంది. అంతే కాకుండా ప్రదర్శన స్వరూపమే రోజు రోజుకు మారిపోతుంది. ఆధునిక ప్రచార సాధనంగా మారిపోయిన ఈ కళారూపాన్ని ప్రజలు విశేషంగా ఆదరిస్తున్నారు. కుటుంబ నియంత్రణ, అక్షరాస్యత, మద్యపాన నిషేదం, పచ్చదనం పరిశుభ్రత మొదలైన కార్యక్రమాలను ప్రచారం చేయడానికి ఈ కళారూపం ఎంతో ఉపయోగపడుతుంది.

**అడుగులు:** నృత్యంలో వివిధ రకాల గెంతులుంటాయి. వీటిని 'అడుగులు' అంటారు. ఆది అడుగు, రెండో అడుగు, మూడో అడుగు, పర్ణశాల, పద్మవ్యూహం, బేరి, పోట, కత్తెర అడుగు మొదలైన 20 రకాలకు పైగా అడుగులు ప్రచారంలో ఉన్నట్లు తెలుస్తుంది. "ఏ అడుగు మార్పు చేయాలన్న ఆది అడుగు ప్రాణం. కాబట్టి అడుగు మారే ప్రతిసారి మొదటగా ఆది అడుగులోకి వచ్చి తిరిగి కొత్త అడుగులోకి మార్చుకుంటారు. అడుగు వేగం లయబద్ధంగా హెచ్చుతూ, తగ్గుతూ ఉంటుంది. ఈ విధంగా మెల్ల మెల్లగా నృత్య వేగాన్ని పెంచి స్వరాన్ని తారా స్థాయికి పెంచి అందరూ నృత్యం అడుగులను హఠాత్తుగా ఆపి నిశ్శబ్దంగా బంగిమలో నిలబడిపోతారు. వీటినే 'నిలుపులు' అంటారు. ఈ నిలుపులలో మెళకువలను గురువు శిష్యుకు నేర్పిస్తారు.

**వేషధారణ:** స్త్రీ పురుషులిద్దరూ ప్రదర్శనలో పాల్గొంటారు. స్త్రీల వస్త్రధారణ సాధారణంగానే ఉంటుంది. స్త్రీ పురుషులిద్దరూ నడుముకు తలకు ఎరుపు రంగులో ఉన్న గుడ్డను కట్టుకుంటారు. పురుషులు బనియన్ ధరించి, పంచెను గోచిలాగ కట్టుకుంటారు. దట్టీగుడ్డను ఉపయోగించి గట్టిగా బిగిస్తారు.

**United International Journal of Multidisciplinary Research**
ISSN: 3048-6726 (UIJMR) Impact Factor: 6.934 (SJIF)
An International Peer-Reviewed and Refereed Multidisciplinary Journal
www.uijmr.in Vol-3, Special Issue-II ,2026

కళాకారులందరూ మెడలో దండలు వేసుకొని కాళ్ళకు గజ్జెలు కట్టుకుంటారు. కుడి చేతిలో భజన చెక్కలూ ఎడమ చేతిలో చేతిరుమాలు పట్టుకుంటారు. కళాకారులందరూ ఒకే రంగు బట్టలను ధరిస్తారు.

**ప్రదర్శనా సందర్భం:** పండుగ దినాలు, ఉత్సవాలు, ఊరేగింపులు, జాతర్లు, తిరునాళ్ళు, మొదలైన సమయాల్లో ప్రజలు ఒకేచోట ఎక్కువగా గుమిగూడిన సందర్భంలో కళాప్రదర్శన ఉంటుంది. ప్రేక్షకుల నుంచి ఈలలు చప్పట్లు, అరుపులు మిన్నుముట్టి, కళాకారుల్లో ఉద్వేగాన్ని ఉత్సాహాన్ని నింపుతాయి.

ఈ ప్రదర్శన సాధారణంగా రెండు నుంచి 6 గంటల వరకు ఉంటుంది. శ్రీరామనవమి రోజు ఎక్కువసేపు ఊరేగింపులో పాల్గొని కళాకారులు ఊరంతా తిరుగుతూ ప్రదర్శనలిస్తారు. ఒక్కొక్కసారి 3 గంటలపాటు ఏకధాటిగా భజన చేస్తారు.

**కళా ప్రదర్శన:** ప్రదర్శనా స్థలం మధ్యలో 'గడెదీపం' వెలిగిస్తారు. దాని చుట్టూ వాద్య బృందం ఉంటుంది. దీపానికి దగ్గరలో ఇష్టదైవ పటం ఉంటుంది. కొబ్బరి కాయ కొట్టి అందరూ దేవుని పూజిస్తారు. తర్వాత కళాకారులందరూ వరుసగా వచ్చి గురువు పాదాలకు నమస్కరిస్తారు. హార్మోనియం, డోలు, వాద్యాల సహకారంతో కళారూపం ప్రారంభమౌతుంది. గురువు బృందం మధ్యలో ఉంటాడు. కళాకారులు నృత్యం చేస్తూ అడుగులు వేస్తూ ఒక్కొక్కరు వచ్చి చేరి వర్తులాకారంలో నిలబడుతారు.

గురువు 'రమా రమణగోవిందాహరి' అంటూ చెక్కలను వాయిస్తూ పాట మొదలు పెట్టగానే గురవులతోపాటు కళాకారులందరూ తమ తమ చేతుల్లోని చెక్కలను గట్టిగా వాయిస్తారు. మొదట విఘ్నేశ్వర ప్రార్థనతో ప్రదర్శన ప్రారంభమౌతుంది. రామాయణ, భాగవత, మహాభారతాలకు సంబంధించిన గేయాలనే ఎక్కువగా పాడుతారు. శృంగార, హాస్య గేయాలు కూడా ఉంటాయి. ఆధునిక కాలంలో ఈ కళారూపం ప్రచార సాధనంగా మారిన తర్వాత సందర్భానికి తగిన పాటలను అల్లి పాడుకుంటారు.

**కవ్వాయి కట్టెలు:** పొడవాటి వెదురు కర్రకు చివరిభాగంలో ఈటె (బాకు) లాంటి ఆకారంలో కత్తిని అమర్చి ఉంటారు. దీనిని 'కవ్వాయి కట్టె' అంటారు. ఈ కర్ర దాదాపు 5 లేదా 6 మీటర్ల పొడవు కలిగి ఎలాంటి వంకర్లు లేకుండా చక్కగా ఉంటుంది. ఈ కర్రకు ఇనుప చువ్వలకు వేసే ముదురు గోధుమ రంగు వేస్తారు. పై భాగంలో ఉన్న ఈటెకు నిమ్మకాయను చెక్కుతారు. ఆకర్షణీయంగా ఉండడానికి ఈటెకు కింది భాగంలో ఎర్రటి గుడ్డను కడతారు. కవ్వాయి కట్టెలను ప్రదర్శించే బృందాలు తెలుగు ప్రాంతంలో కొన్ని చోట్ల మాత్రమే ఉన్నాయి.

**ప్రదర్శన సందర్భం:** ఒకప్పుడు పులివెందుల ప్రాంతంలో జరిగే పెళ్ళిళ్లు, ఊరేగింపులు, పండుగలు, జాతర్లు, తిరునాళ్లలో ప్రదర్శించే ఈ కళారూపం క్రమ క్రమంగా వివిధ ప్రాంతాల్లో బాగా ప్రాచుర్యం పొందింది. రాజకీయ నాయకుల ఊరేగింపులో ఈ కవ్వాయికట్టె నృత్యాన్ని ప్రదర్శించడం ఓ ముఖ్యమైన ఆకర్షణగా మారిపోయింది.

**ప్రదర్శనా విధానం:** కళా ప్రదర్శనలో 20 నుంచి 30 మంది కళాకారులు పాల్గొంటారు. బృందనాయకుడు చేసే సూచనలను పాటిస్తూ కళాకారులు కవ్వాయి కట్టెలను రెండు చేతులతో పైకి ఎత్తి పట్టుకుంటారు. డప్పుల దరువుకు అనుగుణంగా లయబద్ధంగా నడుస్తూ, నృత్యం చేస్తూ అనేక విన్యాసాలు ప్రదర్శిస్తారు. గుండ్రంగా తిరగడం, పాములాగా మెలకలు తిరుగుతూ పోతున్నట్లు నడవడం, ఎదురెదురు ఉద్దులు ఒకరి వరుసులోకి ఇంకొకరు మారడం, గుండ్రంగా తిరుగుతూ ఒక్కసారి కర్రలన్నీ పై భాగంలో తాకేటట్లు ఆనించి ఒక గుండులాంటి ఆకారాన్ని ఏర్పరచడం మొదలైన విన్యాసాలు చూడముచ్చటగా ఉంటాయి. నడకలో రౌద్రం కనిపిస్తుంది. కళాకారుల్లో వీరావేశాన్ని కలిగిస్తుంది. సైనికుల కవాతు ప్రదర్శనను తలపిస్తుంది.

కవాతు కట్టెలు అనే పేరు నుంచి 'కవ్వాయి కట్టెలు' అనే పేరు వచ్చి ఉండవచ్చునేమోనని ఊహించవచ్చు. వేగంగా నడుస్తూ సుడులు సుడులుగా తిరిగేటప్పుడు, మెల్ల మెల్లగా వర్తులాకారంగా నిలబడడం మొదలైన విన్యాసాలు చూస్తుంటే గగుర్పాటు కలుగుతుంది. డప్పుల మోత, ప్రేక్షకుల ఈలలు కళాకారులకు ఉత్తేజాన్ని కలిగిస్తుంది. రెండు మూడుసార్లు తిరుగుతారు.

**జానపద కళారూపం తప్పెట్లు (డప్పులు):** డప్పు ఒక వాయిద్య విశేషం. దళితుల్లో 'మాదిగ ఉపకులానికి చెందినవారు అనాదిగా ఈ సంగీత సాధనాన్ని కులపరమైన సాధనంగా ఉపయోగిస్తున్నారు. కడప జిల్లాలో వల్లూరు మండలంలో 'తప్పెట్ల' అనే పేరుతో ఒక గ్రామం కూడా ఉంది. అలాగే తప్పెట్ల వాయిద్యంలో ఉపయోగించే 'తుడుము' పేరుతో ఖాజీపేట మండలంలో 'తుడుముల దిన్నె' అనే గ్రామం ఉండడం విశేషం. ఒక వాయిద్య విశేషం పేరుతో గ్రామాలు ఉండటమే గాక కొంతమందికి ఇంటి పేరుగా కూడా ఉండటం కడప జిల్లా ప్రత్యేకతగా చెప్పుకోవచ్చు. కడప, చెన్నూరు, మోడమీదపల్లె, కమలాపురం, ప్రొద్దుటూరు ప్రాంతాల్లో ఈ ఇంటి పేరు కలిగిన వారు చాలా మంది ఉన్నారు. ఇందులో అన్ని కులాల వారు ఉన్నారు.

'తప్పెట్ల వాయిండం' డప్పులు వాయించడం, దరువు కొట్టడం, పలకలు వాయించడం అనే వివిధ పేర్లతో ఈ బృంద నృత్యాన్ని వ్యవహరిస్తున్నారు. కేవలం పురుషులు మాత్రమే అభ్యసించే ఈకళ తెలుగు ప్రాంతమంతటా ప్రచారంలో ఉంది. ఈ మధ్య కాలంలో అక్కడక్కడ స్త్రీలు కూడా డప్పులు వాయించడం జరుగుతుంది.

**సాంస్కృతిక నేపథ్యం:-** 'తప్పెట' అంటే ఒక గుండ్రని ఆకారంలో ఉన్న డోలు లాంటి పరికరం. ఇది ఒక చర్మ వాద్యం. మేక చర్మం గాని, పొట్టేలు చర్మంగాని ఒక గుండ్రని చట్రంలో బిగించి దీనిని తయారు చేస్తారు. వేడి చేసి వాయిస్తే బాగా మోగుతుంది.

ప్రాచీన కాలం నుంచి గ్రామల్లో చాటింపు వేయడానికి ఈ సాధనాన్ని ఉపయోగిస్తున్నారు. ఈ వాయిద్యం నుంచి వచ్చే శబ్దం అందర్నీ ఆకర్షిస్తుంది. గ్రామాల్లో చాటింపు వేసేటప్పుడు ప్రజలు

ఇళ్లలోనుంచి బయటికి వచ్చి వీధుల్లో వేసే 'దండోర'ను వింటారు. ప్రభుత్వ ఉత్తర్వులు గాని, ప్రజా సంబంధ విషయాలను గాని ప్రచారం చేయడానికి ఈ దండోర ఉపయోగపడుతుంది. రచ్చ బండల దగ్గర ఎక్కువసేపు దండోర వేస్తారు. సామాన్యంగా ఒకే వ్యక్తి మాత్రమే దండోర వేస్తాడు. ఒక్కొక్కసారి గ్రామాధికారి తరపున ఉన్న వ్యక్తి కూడా ఈ దండోర వేసే వ్యక్తితో పాటు అనుసరించి దండోర కొట్టడం ఆపిన తర్వాత విషయాన్ని బిగ్గరగా చదువుతూ అందరికీ వినిపిస్తాడు. ఎవరికైనా విషయం అర్థం కాకపోతే దగ్గరికి వచ్చి ఆయనను అడిగి తెలుసుకుంటారు. ముఖ్యంగా ప్రభుత్వ పథకాల ప్రచారం, ప్రభుత్వ ఉత్తర్వులు, పన్నులు రాబట్టడానికి చేసే ప్రకటనలు, ప్రకృతి వైపరిత్యాలకు సంబంధించిన హెచ్చరికలు, చౌకదుకాణాలకు సంబంధించిన విషయాలను తెలియజేయడానికి ఈ వాద్య విశేషం ఎంతగానో ఉపయోగపడుతుంది.

వేలంపాటలు వేసుటప్పుడు దండోర తప్పని సరి. వేలంపాటను పాడేటప్పుడు ఎవరు ఎంత మొత్తాన్ని పాడారో తెలియజేయడానికి దీనికి ఉపయోగిస్తారు. "గ్రామీణ సమాజానికి వాళ్లకు చిరపరిచితాలైన కళల ద్వారానే ప్రచారం సాగించడం ఉచితమే" అని ఆచార్య నాయని కృష్ణకుమారి గారు అభిప్రాయ పడినట్లు నేటి ఆధునిక సమాజానికి సైతం ప్రజలకు అవసరమైన అంశాలను ప్రచారం చేయడానికి ప్రాచీన కళారూపాలే ఎంతో ఉపయుక్తంగా ఉన్నాయి. ఒకప్పటి ఆచారాత్మక కళలు ఆ తర్వాత వినోదాత్మకంగా మరియు ప్రచారాత్మకంగా రూపాంతరం చెందాయడానికి ఈ కళారూపమే చక్కని ఉదాహరణ.

**ప్రదర్శనా నిర్మాణ నేపథ్యం:-** తప్పెట్లను 'తప్పెట గతులు' అనేపేరుతో సమిష్టి కళారూపంగా ప్రదర్శిస్తారు. ఒకే కళారూపం వ్యష్టిగా మరియు సమిష్టిగా ప్రదర్శించే కేవలం కొన్ని కళారూపాల్లో ఇదీ ఒకటి. ఈ కళారూపం నేటికి గొప్ప వినోద సాధనంగా గ్రామీణులేగాక పట్టణ ప్రజలు కూడా విశేషంగా ఆదరిస్తున్నారు. ప్రతి శుభ, అశుభ కార్యాలకు ఈ కళారూపం తప్పనిసరిగా ఉపయోగపడుతుంది. నరనరాల్లో నూత్న ఉత్తేజాన్ని రేకెత్తించే ఈ వాయిద్య ధ్వని వినగానే ప్రతి మనిషిలో కూడా కొంత చైతన్యం కలుగుతుంది. చాలామంది ఈ ధ్వనికి అనుగుణంగా తమకు తెలియకుండానే అడుగులు వేస్తుంటారు.

డప్పుకు చర్మంతో తయారు చేసిన 'బెల్టు' ఉంటుంది. దానిని కళాకారులు మెడలో వేసుకొని, చంక మధ్యలో కుదురుగా అమర్చుకుంటారు. డప్పును రెండు డబ్బల సహాయంతో క్రమ పద్ధతిలో వాయిస్తారు. ఒకటి వెదురు దబ్బతో తయారు చేసిన సన్నని కర్ర. రెండోది కొంచెం లావుగా రూలు కర్రలాగా ఉంటుంది. రెండు చేతులతో 'జగ్లికన్' జతిలో వాయిద్యాన్ని మొదలు పెడతారు. వీటిని 'కోపులు' అనిపిలుస్తారు. 1,2,3,4,5, మొదలైన అడుగుల పేర్లతో ఈ కోపులు ప్రసిద్ధం. కడప జిల్లాలో దండువారికోపు, పులి అడుగు, గుండంకోపు, మదిలికోపు, మొదలైనవి ప్రసిద్ధమైన జతులు. ఇంకా జిల్లాలో

చాలా ప్రాంతాల్లో కళా బృందాలున్నాయి. అయితే ఖాజీపేట మండలం, దుంపలగట్టు గ్రామానికి చెందిన బృందానికి గొప్పపేరు ప్రఖ్యాతులున్నాయి.

**గురువు ప్రాధాన్యతః-** గురువు ప్రత్యేక శిక్షణ ద్వారా కళా బృందాలను ఏర్పాటు చేస్తాడు. శిక్షణ పూర్తి చేసుకున్న కళాకారులు ఆయనకు గురుదక్షిణ సమర్పించుకుంటారు. తీరిక వేళల్లో, పనిపాటలు లేని సమయాల్లోను ముఖ్యంగా రాత్రిపూట మాత్రమే శిక్షణ ఉంటుంది. కళారూపాన్ని ప్రదర్శించేటప్పుడు ఎక్కువ అనుభవమున్న వ్యక్తినే మిగతా బృంద సభ్యులు అనుసరిస్తారు. ఆయన చేసే హెచ్చరికల ద్వారా ఎవరైనా వరుస తప్పి పోయిన సందర్భంలో వెంటనే జతులను సవరించుకుంటారు. ఈ అనుభవం కల్గిన కళాకారుని దగ్గర మిగతా సభ్యుల దగ్గర ఉన్న వాద్య సాధనం కంటే భిన్నమైన వాద్య విశేషముంటుంది. దానిని 'తుడుము' అని వ్యవహరిస్తారు. దీని చప్పుడు మిగతా వాటికంటే భిన్నంగా ఉంటుంది. ఆకారంలో కూడా చాలా తేడా ఉంటుంది. ఇది మిగతా డప్పుల కంటే చిన్నగా ఉంటుంది. పై భాగంలో డోలు లాగ ఉండి కింది భాగంలో సమతలంగా ఉంటుంది. ఇది కుంభాకారంలో ఉంటుంది. దీనిని వాయించడానికి చెప్పుల ఆకారంలో ఉన్న జంతు చర్మంతో తయారు చేసిన తుడుము డబ్బలను ఉపయోగిస్తారు. రెండు చేతులలో రెండు 'తుడుము డబ్బలను' ఒకేసారి వాయిస్తే శబ్ద తీవ్రత అధికంగా ఉంటుంది. కళాప్రదర్శన వినోద పరాకాష్టకు చేరుకున్నప్పుడు దీనిని రెండు చేతులతో వేగంగా కళాకారులు వాయిస్తారు. మిగతా సమయాల్లో వరుసలో జతిని బట్టి ఒక్కచేత్తో వాయిస్తారు. మెడలో బెల్టు సహాయంతో వేలాడదీసుకొని పొట్టమీద పెట్టుకొని దీనిని వాయిస్తారు. తుడుమును వేగంగా వాయించేటప్పుడు ప్రేక్షకుల ఆనందం అంతా ఇంతా కాదు. దీనిని వాయించే కళాకరుడు బృందం మధ్యలో నిలబడి అలసిపోయిన మిగతా కళాకారులకు ఉత్సాహం మోకాళ్లను వంచి, రెండు చేతులతో వేగంగా తుడుము వాయిస్తాడు. బృంద సభ్యుల్లో ఉత్సాహం కల్గించడానికి, వరుసలు మార్చడానికి, గతులు సవరించుకోవడానికి ఈ వాద్య విశేషం ఎంతగానో ఉపకరిస్తుంది.

**కళా ప్రదర్శనః-** ఆధునిక కాలంలో ఈ కళాకారుల వేషధారణలో కూడా కొంత మార్పు వచ్చింది. ప్రోత్సాహం, ఆదరణ ఎక్కువౌతున్న కొద్దీ కళాకరులు ఒకే రంగు దుస్తులు ధరిస్తున్నారు. పంచెను సైకిల్ కట్టులాగ కట్టుకొని, కాళ్లకు గజ్జెలు ధరించి తలకు ఎర్రటి తలపాగను చుట్టుకుంటారు. మెడలో పూసల దండలు వేసుకుంటారు. కళా ప్రదర్శనలో 10 నుంచి 15 మంది సభ్యులు పాల్గొంటారు. ప్రదర్శనకు ముందుగా చెత్తగడ్డితో మంటలు వేసి, ఆ సెగలో పలకలను 'కాక' పెట్టుకుంటారు. పలకలను కాలివేళ్లపైన పెట్టుకొని చర్మం బిగుతుగా అయ్యేవరకు 'కాక' పెడతారు. తర్వాత శృతి చూసుకొని ప్రదర్శనకు సిద్ధమౌతారు. ఆధునిక కాలంలో ప్లాస్టిక్ డప్పులు వచ్చాయి. వాటికి కాక అక్కరలేదు. కేవలం స్క్రూలు సవరిస్తే సరిపోతుంది.

**United International Journal of Multidisciplinary Research**
ISSN: 3048-6726 (UIJMR) Impact Factor: 6.934 (SJIF)
An International Peer-Reviewed and Refereed Multidisciplinary Journal
www.uijmr.in Vol-3, Special Issue-II ,2026

ఇప్పుడు ఈ కళ రంగస్థలంపైన కూడా ప్రదర్శింపబడుతుంది. ఈ రంగస్థలంపైన చేసే ప్రదర్శనలో 1) వృత్తాకార వరుస 2) ఎదురెదురు వరుస 3) ముందుకు వెనకకు మారే వరుస 4) ఇరు ఉద్దుల వరుసస 5) వృత్తిలోపలికి, వెలుపలికి మారే వరుస 6) మోకాళ్ల మీద కూర్చొని చేసే వరుస 7) పిరమిడ్స్ మొదలైన రకాలున్నాయి. మొదటి బృంద సభ్యులు ఒకరి వెనక ఇంకొకరు డప్పులు వాయిస్తూ వేదిక మీదకి వస్తారు. ఆ తర్వాత వృత్తాకారంలో నిలబడుతారు. ఇలా నిలబడేటప్పుడు జతి ఆది తాళం, జామక, తక తక, చప్పుడుతో నాలుగు అడుగులను రెండు సార్లు వేస్తారు. అంటే మొత్తం ఎనిమిది అడుగుల్లో నృత్యం సాగుతుంది. తర్వాత ఎదురెదురు వరుసలో నిలబడి ముందుకు వెనకకు కదులుతూ నృత్యంచేస్తారు. రెండు వరుసల్లో వృత్తాకారం లోపల ఒక వరుస, బయట ఒక వరుస నిలబడి తమ తమ వరుసలను మార్చుకుంటూ నృత్యం చేస్తారు. కూర్చొని చేసే వరుసలో ఒకేసారి అందరూ గుండ్రంగా తిరుగుతూ అడుగులు వేస్తారు. చూపరులను ఈ దృశ్యం ఎంతో ఆకట్టుకుంటుంది.

చివరగా పిరమిడ్ విన్యాసాలను ప్రదర్శిస్తారు. మొదటి ఆరుమంది కళాకారులు నిలబడుతారు. వారి భుజాలపైన ముగ్గురు కళాకారులు వారిపైన ఇద్దరు, వారిపైన ఒక కళాకారుడు నిలబడి 'జాం జాం జాం' 'జగ్లికన్', జగ్లికన్' జతులలో వాయించడంతో ప్రదర్శన పూర్తి అవుతుంది.

కొన్ని ఇతర కళారూపాల ప్రదర్శనకు కూడా ఈ వాద్యం తప్పనిసరి. కర్రసాము, కత్తిసాము, కీలుగుర్రం, పులివేషం, నామాల సింగడు, కవ్వాయి కట్టెలు, చెక్కభజన, కోలాటం మొదలైన కళారూపాల ప్రదర్శనలో ఈ వాయిద్యం ప్రేక్షకులను విశేషంగా ఆకర్షిస్తుంది. పండుగలు, జాతర్లు, ఉత్సవాలు, ఊరేగింపులలో ఈ కళారూపం తప్పనిసరిగా వుంటుంది.

వివిధ ప్రజా ఉద్యమాల్లో ప్రజలను చైతన్య పరచడానికి డప్పుల సహాయంతో ఉద్యమ గీతాలను ఆలపించడానికి కూడా ఉపయోగిస్తున్నారు. అందుకే తెలుగు ప్రాంతంలో అనేక ఉద్యమ పార్టీలు ఈ కళారూపాన్ని తమ సొత్తుగా భావిస్తున్నాయి. ఈ కళారూపం నేడు సంగీతం, నృత్య, సాహిత్యంతో కలిసి సమాహార కళగా రూపాంతరం చెందింది. శాస్త్రీయ కళాలకు దీటైన కళారూపమిది. ఇలాంటి ప్రజా కళలే మానవ సమాజాభివృద్ధిలో తమవంతు పాత్రను పోషిస్తున్నాయి. అందుకే శాస్త్రీయతకు పునాది జానపద కళలేనని ఒప్పుకోక తప్పదు.

**జానపద వినోద క్రీడ – కర్రసాము:** 'కర్రసాము' అంటే కర్రతో చేసే వ్యాయామం. నియమిత కొలత కలిగి వంపు లేకుండా చక్కగా ఉన్న వెదురు కర్రను ఎన్నుకొని, దానితో చేసే సామును కర్రసాము అంటారు. కర్రను తిప్పుతూ వివిధ రకాల భంగిమలతో లయబద్ధంగా అడుగులు వేస్తూ ప్రదర్శించే క్రీడ కర్రసాము. ఊరేగింపులు, జాతర్లు, తిరునాళ్లు, పెండ్లి ఊరేగింపులు, పండుగ సమయాల్లో ఈ కళను ప్రదర్శిస్తారు.

**చారిత్రక నేపథ్యం:** ఈ కర్రసాము విద్యను మానవుడు ఎప్పుడు అభ్యసించడం ప్రారంభించాడో తెలుసుకోవడం చాలా కష్టం. చారిత్రక దృష్టితో పరిశీలిస్తే మానవుడు అనాదిగా కర్రను వివిధ పనులకు

**United International Journal of Multidisciplinary Research**
ISSN: 3048-6726 (UIJMR) Impact Factor: 6.934 (SJIF)
An International Peer-Reviewed and Refereed Multidisciplinary Journal
www.uijmr.in Vol-3, Special Issue-II ,2026

ఉపయోగిస్తున్నాడు. మొదట ఆహార సంపాదన కోసం వేటాడేటప్పుడు, వేటాడిన జంతువును మోసుకొని వచ్చేటప్పుడు కర్రను ఉపయోగించేవాడు. బాణాలను, అంబులను తయారు చేయడానికి, వ్యవసాయ పనులకు, గృహనిర్మాణానికి, వంటచెరుకుగా కూడ కర్ర ఉపయోగపడుతూ వచ్చింది. ముఖ్యంగా ఆత్మ సంరక్షణ కోసం కర్రసాము అభ్యసించి ఉండవచ్చు. ఆ తర్వాత నేడు వినోద క్రీడగా రూపాంతరం చెందినట్లు తెలుస్తుంది.

కర్రసాములో అనేక విన్యాసాలున్నాయి. వ్యష్టిగానే కాకుండ సమిష్టి కళారూపంగా కూడ ఈ విద్యను ప్రదర్శిస్తారు. ఒకేసారి అనేక మందితో వీరోచితంగా పోరాడే క్రీడగా నేడు అవతరించింది. దేహధారుఢ్యాన్ని పెంచే చక్కని వ్యాయామంగా కూడ దీనిని అభివర్ణించవచ్చు.

**కర్రసాము శిక్షణ:** కర్రసాములో శిక్షణ ఇచ్చే గురువులు తెలుగుదేశంలో పలు ప్రాంతాలలో ఉన్నారు. వీరు 2 లేదా 3 నెలల పాటు శిక్షణ ఇస్తారు. కర్రని శరీరానికి తగలకుండా తిప్పుతూ శత్రువును ఎదుర్కొని తనను తాను రక్షించుకొనే విధానాన్ని శిష్యులకు నేర్పుతారు. ముఖ్యంగా సాయంకాలం ఈ శిక్షణనిస్తారు. మహిళలు కర్రసాములో శిక్షణ తీసుకోవడం అరుదు. పురుషులే ఎక్కువగా ఈ క్రీడను అభ్యసిస్తారు.

ప్రత్యర్థుల నుంచి తనకు ఎలాంటి గాయాలు తగలకుండా తప్పించుకోవడం, అలాగే వారిని ఓడించి తనలోని పోరాట పటిమను నిరూపించుకోడానికి ఈ శిక్షణలో గురువు శిష్యులకు మెలకువలను నేర్పుతాడు. ప్రదర్శనా సమయాల్లో కూడ గురువు శిష్యబృందం వెంట ఉండి ఎప్పటికప్పుడు లోటుపాట్లను తెలిపి సవరిస్తుంటాడు. అందుకే శిష్యులకు గురువుపట్ల అమితమైన భక్తి, ప్రేమ ఉంటుంది. శిక్షణలో కఠినమైన నియమాలుంటాయి. కళాకారులు ఉడాన్ (పల్టీ) కొట్టి కర్రను ఒడుపుగా అందుకొని కళను ప్రదర్శిస్తాడు. ముందుగా గురువుకు నమస్కరిస్తాడు.

**కర్రసాములో వివిధ విన్యాసాలు**

1) కర్రలతో నడవడం 2) రెండు కర్రలను రెండు చేతులతో తిప్పడం 3) కర్రలకు అగ్గి అంటించి తిప్పడం 4) తాడుతో కర్రలకు రెండు చివరల రెండు రబ్బరు బంతులను కట్టి తిప్పడం 5) నేలపై పడుకొని కర్రను తిప్పడం 6) కర్రను అరచేతి మధ్యలో నిలబెట్టి డప్పు దరువుకు అనుగుణంగా అడుగులు వేయడం 7) చాలామంది ప్రత్యర్థులతో పోరాడుతూ కర్రను తిప్పడం 8) కర్రను కుడిచేత్తో పట్టుకొని నేలమీద కూర్చొని గుండ్రంగా తిప్పుతూ కాళ్ళకు తగలకుండా ఎగురుతూ తప్పించుకోవడం మొదలైన విన్యాసాలను శిక్షణలో నేర్చుకుంటారు.

**ప్రదర్శనా విధానం:** కళాకారులు బనియన్ ధరించి పంచెను సైకిల్ కట్టు కట్టుకుంటారు. తలకు ఎర్రని గుడ్డను కట్టుకుంటారు. డప్పుల మోత వినిపిస్తుండగా, డప్పులు వాయించేవారికి ఎదురుగా వచ్చి ఒక్కొక్క కళాకారుడు వారి కర్రను నేలపై ఉంచుతారు. వెనుకకు వెళ్ళి భూమాతకు నమస్కరించి

**United International Journal of Multidisciplinary Research**
ISSN: 3048-6726 (UIJMR) Impact Factor: 6.934 (SJIF)
An International Peer-Reviewed and Refereed Multidisciplinary Journal
www.uijmr.in Vol-3, Special Issue-II ,2026

పరుగెత్తుకుంటూ వచ్చి గాలిలో 'ఉడాన్' (పల్టి) కొట్టి నేర్పుగా కర్రను అందుకుంటారు. తర్వాత గురువు దగ్గర ఆశీర్వాదం తీసుకొని కళా ప్రదర్శన మొదలుపెడతారు. ప్రేక్షకులు కళాకారుల చుట్టూ వలయాకారంలోనిలబడుతారు. ప్రదర్శనలో సరిసంఖ్యలో 6 మందిగాని 8 మందిగాని కళాకారులు పాల్గొంటారు. డప్పుల వాయిద్యానికి అనుగుణంగా అడుగులు వేస్తూ కర్రసాము చేస్తారు. మొదట కళాకారులు ఎవరికివారు ఇతరులతో సంబంధం లేకుండా తగినంత దూరంలో నిలబడి తమ విద్యను ప్రదర్శిస్తారు. ఈ సమయంలో వేగం హెచ్చినపుడు కర్ర కనిపించని పరిస్థితి కూడా ఏర్పడుతుంది. చేతులలో కర్రను మార్చుకుంటూ, శరీరానికి అన్ని వైపులా కర్రను గిరగిర తిప్పుతుంటే ప్రేక్షకుల హర్షద్వానాలు మిన్నుమిట్టుతాయి. ఈలలు, కేకల సందడిలో సాగే క్రీడ చూపరులను విశేషంగా ఆకట్టుకుంటుంది. కొంత మంది బృంద సభ్యులు కర్రల సహాయంతో ప్రేక్షకులను నియంత్రిస్తుంటారు. ఉద్వేగానికి లోనైన కళాకారులను బృంద సభ్యులు తమ చేతిలోని కర్రలను అడ్డుపెట్టి ప్రదర్శన నిలిపేటట్లు చేస్తారు.

**ప్రత్యేక విన్యాసాలు:** కర్రసాము ప్రదర్శనలో కర్రను తిప్పుతూ, చంకల మధ్యలో, కాళ్ళ మధ్య నుండి కర్రను తీస్తూ, శరీరానికి తగలకుండా విన్యాసాలు చేస్తారు. వేగంగా తిరిగే కర్రను గాలిలోకి ఎగరవేసి తిరిగి దానిని పట్టుకొని యథా ప్రాకారం తిప్పే విన్యాసం అద్భుతాన్ని, విస్మయాన్ని కల్గిస్తుంది. కొంతమంది కళాకారులు బొటనవేలు సందులలో కర్రను పట్టుకొని, కర్రలతో నడుస్తూ డప్పు వాద్యానికి అనుగునంగా అడుగులు వేస్తారు. ఇలా రకరకాల విన్యాసాలు ప్రదర్శించిన తర్వాత కర్రసాములో చివరి ఘట్టంగా పోరాట క్రీడ మొదలవుతుంది.

కర్రసాము ప్రదర్శన అనేక రకాలుగా సాగుతుంది. ఈ కళాప్రదర్శనలు అన్ని ప్రాంతాల్లో ప్రదర్శింపబడుతున్నాయి. ఇందులో 3 రకాలు ప్రదర్శనలున్నాయి. 1) బాణా కర్రలు 2) బాణా వైరి 3) అగ్గి బరాట.

**బాణా కర్రలు:** వాద్యగతికి అనుగుణంగా అడుగులు వేస్తూ కర్రను వేగంగా తిప్పడం మొదటి దశ. తర్వాతి దశలో ఇంతకు ముందు చెప్పినట్లు వివిధ విన్యాసాలు ప్రదర్శిస్తారు. నిష్ణాతులైన కళాకారుల ప్రదర్శనలో ప్రేక్షకులు చిన్న చిన్న రాళ్ళతో కర్రను తిప్పే కళాకారుని కొట్టినప్పటికీ ఆ రాళ్ళు తగలకుండా తప్పించుకుంటారు. దీనిని బట్టి కర్ర తిరిగే వేగాన్ని మనం అంచనా వేసుకోవచ్చు. ఒకొక్కసారి కర్ర తిప్పేటప్పుడు అది శరీరానికి తాకడంతో కళాకారులకు చిన్న చిన్న గాయాలవుతుంటాయి. వాటికి బండారు (కుంకుమ పసుపుల మిశ్రమం) పూసి కట్టుకడతారు. గురువు సూచనతో బణాకర్రల ప్రదర్శన ఆగిపోతుంది.

**బాణావైరి:** ఇది కర్ర విద్యలో రెండవ ఘట్టం. వైరి పక్ష్యాలతో వీరోచిత పోరాటం లాగా జరిగే ఈ అద్భుత ఘట్టాన్ని చూడడానికి ప్రేక్ష సమూహం ముందుకు దూసుకొని వస్తుంటుంది. వారిని నియంత్రించడానికి బృంద సభ్యులు నానా తంటాలు పడుతుంటారు.

ఈ ప్రదర్శనలో కళాకారులు జట్లు జట్లుగా ఏర్పడి, జట్ల మధ్య కొంత దూరం ఉండేటట్లు నిలబడుతారు. ఇందులో 3 నుంచి 5 జట్లు పాల్గొంటాయి. కర్రను మధ్యలో పట్టుకొని ఎడమవైపుకు ఒకసారి, కుడివైపుకు ఒకసారి తిప్పుతూ అప్పుడప్పుడు నేలపైకి వంచుతూ, డప్పుల వాద్యానికి అనుగుణంగా చిందులేస్తూ ఎదురెదురు కళాకారులు దగ్గరికి వస్తుంటారు. 'జగ్లికన్' జతిలో వాయించే వరుసలు కళాకారులకు మంచి ఊపునిస్తాయి.

మొదట జట్టులోని ఒక సభ్యుడు ఇంకొక సభ్యుని కర్రతో కొట్టడానికి ప్రయత్నిస్తాడు. ఎదుటి వ్యక్తి కర్రను మధ్యలో పట్టుకొని అడ్డంగా పెట్టి దెబ్బ తగలకుండా తప్పించుకుంటాడు. కొట్టే వ్యక్తి లయబద్ధంగా చిందులువేస్తూ ముందుకు కదులుతూ కుడివైపు నుంచి ఒకసారి, ఎడమవైపు నుంచి ఇంకొకసారి ఇలా మార్చి మార్చి కొడుతూ, అప్పుడప్పుడూ గాలిలోకి ఎగిరి పల్టీలు కొడుతూ కర్రను 'టపా టపా'మని కొడుతూ విన్యాసాలు ప్రదర్శిస్తాడు. ఇదే విధంగా ఇతర కళాకారుడు కూడ విద్యను ప్రదర్శిస్తాడు. చివరగా ఇద్దరూ దగ్గరికి వచ్చి ఒకేచోట నిలబడి గుండ్రంగా తిరుగుతూ అడుగువేస్తూ కర్రలతో యుద్ధం చేస్తారు. గురువు సైగతో ఆ ఘట్టం ముగుస్తుంది.

**అగ్గి బరాటా:** బాణా కర్రలకు రెండువైపుల బట్టలు చుట్టి కిరోసిన్లో ముంచి వెలిగించి కర్రలను బాణాకర్రల విద్యగా ప్రదర్శిస్తారు. వెదురు దబ్బలతో చక్రంలాగా తయారు చేసి దానికి అక్కడక్కడ మంటలు పెట్టి విన్యాసాలు ప్రదర్శిస్తారు. నేలపై పడుకొని కర్రను తిప్పడం, మంటలు శరీరానికి తగలకుండా తప్పించుకోవడం అత్యంత సాహసంతో కూడిన విద్యాప్రదర్శన. కొందరు కళాకారులు అగ్గిబరాట తర్వాత అనేక విన్యాసాలు ప్రదర్శిస్తారు.

కర్రలకు రెండు చివరల రెండు బతులను కట్టి బాణాకర్రలను ప్రదర్శించడం, సన్నని పొడవైన ఇనుప రేకులను బెల్టులాగా కత్తరించి వాటిని తిప్పడం మొదలైన ప్రదర్శనలు కూడ చేస్తారు.